# సుగంధి

సుబ్రమణ్యం ఆ వూరు బెల్లం కొనడానికి వెళ్ళి, తీరా చెరుకు చేను జట్టికి తీసుకున్నాడు. యేమి సరదా అన్నమాట లేనిచోట మూణ్ణెలెట్లా కాలం గడపడం? వాళ్ళ వూళ్ళో అతని వ్యాపారం పని రెండు గంటల్లో ముగించి స్నేహితులతో సైకిలెక్కి రోడ్లన్నీ తిరగడం అలవాటు. కాఫీ హోటళ్ళలో, మీటింగులలో, నాటకాల్లో, యెక్కడ చూసినా వాళ్ళ మొహాలు ప్రత్యక్షం. ఇతను లేకండా ఆ జట్టుకంతా యెట్లా పొద్దు పోతుందోగాని, అతనికి మాత్రం వ్యాపారం సంగతి దేవుడెరుగు. వెంటనే యింటిదోవ పట్టాలని రోజూ అనిపించేది. కాని తన అన్న భయం విస్తారం. కోపమొచ్చి మామూలు ప్రకారం వారం రోజులు మాట్లాడం మానేశాడంటే యిల్లంటే నరకమవుతుంది.

ఆ వూరి చుట్టూ కొండలూ, అడవులూ. యేం తోచక తుపాకీ పట్టుకుని వాటిల్లో తిరిగితే సాయంత్రానికి యిరవై ముప్పై తోటాలు కర్చయేవిగాని, ఇంటికి మాత్రం వుత్త చేతుల్తోనే చేరుకునేవాడు. ఒక రోజు మధ్యాహ్నం జింకనోదాన్ని గురి భద్రంగా చూసి కాల్చాడు. ఇతని సామర్థ్యం తెలిసిన దానిమల్లే అది తీరిగ్గా నడిచి వెడుతోంది. ఒకసారి ఆగి అతనివంక చిరునవ్వుతో చూసిందేమోనని కూడా అనుమానం. తుపాకీ పారేసి పరిగెట్టికెడితే దొరికేదేమో ననుకున్నాడు. జింకలూ, పిట్టలూ వొక్కటి తన కందకపోవడం, గురి తప్పినప్పుడల్లా పోనీ జీవ హింస తప్పిందికదా, అనే అతని ఆత్మ సంతుష్టి, జంతువులకి ఆత్మ

వుందా లేదా అనే సందేహమూ యివన్నీ ఆలోచిస్తో నిర్జనమైన ఆ ప్రదేశంలో నడుస్తున్నాడు. అతని చూపుమేరకంటే బాగా యెత్తుగా పెరిగిన చెట్లూ, కళ్లు తిరిగే లోయలూ, అస్తమించే సూర్యుణ్ణప్పుడే చాటు చేసిన పర్వత శిఖరాలూ చుట్టూ వున్నాయి. దోవలో తటాలున మధ్య మధ్య గల గలమని నవ్వుతో కిందికి గంతులేసే సెలయేళ్ళు, అతనిని, తుపాకీని చూసికూడా లక్ష్యం లేకండా చుట్టూ యెగురుతో, అరుస్తో, పోట్లాడుతో, లెక్కలేని పక్షులు.

కొంచం దూరం నడిచిం తరవాత అతి సుందరమైన ఒక ప్రదేశం చేరుకున్నాడు. ఒక పెద్ద యేరు, ఇరుపై అడుగుల పైనించి కిందికి పడుతోంది. అనేక సంవత్సరాలట్లా పడి కింద యేర్పడ్డ ఒక పెద్ద చెరువు. ఆ చెరువు చుట్టూ దట్టంగా పెరిగిన చెట్లు నీళ్ళని తాకుతున్నాయి. మధ్య ఆకాశం ప్రతిఫలిస్తోంది. ఎండగా వున్నప్పుడు విశ్రమించడానికి వనకన్య ఆ స్థలాన్ని నిర్మించుకున్నట్లుంది. అడ్డమున్న జీడిమామిడి కొమ్మల్ని వొత్తిగించి సుబ్రమణ్యం లోపలికి వెళ్ళాడు. పడుకోడానికి యేర్పడ్డదా అన్నట్లు వున్న తెల్లని చదునురాయిమీద ఒక లంబాడీ పిల్ల పడుకుని వుంది. కోలగావున్న చంపలమీద చీదరగా జుట్టుపడ్డది. నిండు పెదిమెలు నవ్వుతున్నాయి. నిద్దట్లో వూపిరి పీలుస్తో వుంటే పైకిలేచే ఆమె వక్షమూ, గుండ్రని మెడా అతని దృష్టిని ఆపేశాయి. వొంటరిగా ఆ పిల్ల నిచూడడం అతనికి సిగ్గేసింది. పొట్టి పావడ మోకాళ్ళవరకూ చెదిరి వుంది. వెనక్కి తిరిగాడు కాని ఆ రాతిమీద నుంచి పొర్లి నీళ్ళల్లో పడుతుందేమోనని వంకపెట్టి లేపాలనిపించింది. నిజంగా పడుతుందేమోనని భయం కల్పించుకుని తన భయాన్ని విశ్వసించాడు. ఆ కళ్లు తెరిస్తే యెట్లా వుంటాయో. ఆమె కంఠం మాటలూ వినడానికి యెంత బావుంటాయో! కాళ్ళతో రాళ్ళ చప్పుడు చేసినా ఆమె లేవలేదు. భుజం మీద చెయ్యివేసి వూయించాడు.

అట్లానే పడుకుని కళ్ళు తెరిచి అతని మొహంకేసి చూస్తో పడుకుంది. కొత్తలేదు. చిరునవ్వు నవ్వింది.

"పడతావు"

"ఊఁ"

"పడతావని లేపాను"

"ఊఁ"

మాటలు రావో. భాష తెలీదో! పడతావని సౌజ్ఞచేసి చూపించాడు. హేళనగా భయం లేదన్నట్టు నవ్వింది. వొంటరిగా ఆ చక్కని పిల్లా, సృష్టి సౌందర్యం. ఆమె చిరునవ్వునీ చూసి సుబ్రమణ్యానికి హృదయాం దోళనం గాఢంగా కలిగింది. పక్కన కూచున్నాడు. ఆమె లేవలేదు. మెల్లిగా ఆమె చెయ్యినితాకి తీసుకుని పెద్ద కొయ్యగాజుల్ని అటూ యిటూ జరుపుతో ఆమె మొహం వంక మోహంతో చూశాడు.

"నువ్వెవరు?"

యే భాషలోనో యేమిటో అంది అర్థం కాకండా, కాని కోయల మాట్లాడితే అర్థం కావలసిన అవసరం యేముంది? ఇద్దరు కదల్లేదు. చిలకలు అరుస్తో యెగిరాయి. వుడత ఒకటి రాయిమీదికి పరుగెత్తి తొంగి చూసింది. నీటి కాకులు రెండు చెరువులో సరసాలాడుతున్నాయి. పొట్టి చొక్కాల్లోంచి కనపడే గుండ్రంగా బలసిన ఆమె చేతుల అందం చూసి యెవరు అరటి పూచలని వర్ణించరు? ఆమె కళ్లు ఆ కొండ చెరువంత నిర్మలంగానూ వున్నాయి. అతనికి ఆమెతో యేదో మాట్లాడాలి అనిపిస్తుంది. మొద్దు లంబాడీ చొక్కాలో అణిగి కూడా కావరం వొంపు తిరిగి దాన్ని గట్టిగా లాగి పట్టిన ఆమె వక్షం అతని కళ్ళని కట్టేసింది. ఒక్కసారి చేత్తో ఆ నున్నతనాన్ని స్పృశిస్తే! లావణ్యంగా పెరిగిన యీ జువ్వి

మొక్క మీద చెయ్యినానిస్తే! నున్నని అలల వొంపులమీద యీదీ నట్టే! యీ సృష్టి కన్యని తాకితే! తప్పా! కానీ అగ్నిపర్వతం లోంచి వలె నిప్పులు కురిస్తే! మెల్లిగా చెయ్యిని అదిమాడు. అతని వుప్పాడ కండువా జరీ అంచును చేత్తో తీసి చూస్తోంది. అతనికి పరవశమయింది. ఇట్లాంటి నిర్మలమైన వజ్రం యీ కొండల్లో దొరుకుతుందనుకో లేదు.

అతని రక్తం దూకుతోంది. మొహంతో నున్నని మెడమీద చేతిని జారనిచ్చాడు: చివాలున లేచి నుంచుంటి. ఆమె వంక చూడకండానే అతను లేచి రెండు చేతులా జాచి ఆమెని కావిలించుకోపోయినా నను కున్నాడు. రెండో నిమిషం వెన్నుమీద పడుకుని ఆకాశం చూస్తున్నాడు. సాయంత్రము అయిదు గంటలకే ఆకాశమంతా యెర్రటి నక్షత్రాలతో నిండింది. లేచి పీప దులుపుకునేటప్పటికి అతనొక్కడే వున్నాడు.

నడుములో నెప్పి ఆ రాత్రంతా ఆ పిల్ల నే జ్ఞాపకం చేసింది. అంత తోపు తోసిన ఆ పొగరుని తనకి స్వాధీనం చేసుకోవాలి మన్నాడు మళ్ళీ అక్కడికి వెళ్ళి కూచున్నాడు. రాత్రిదాకా వున్నా యెవరూ రాలేదు. అతనూ పట్టు విడవక ప్రతిరోజూ వెళ్ళాడు. యేరుని లేడి యెట్లా వదల లేదో అట్లానే ఆ స్థలాన్ని యీ పిల్ల వదలలేదని రూఢిగా వుంది అతని మనసులో అతనను కున్నట్టే నాలుగో రోజున యేవో ఆలోచిస్తో వొచ్చింది. అతను గచ్చపొద చాటున దాక్కున్నాడు. రాయిమీద కూచుని పిచ్చిపాట పాడుతోంది. ఆ అర్థంలేని పాట మధురంగా వొచ్చి అతని మనసుని వూయించేసింది. మెల్లిగా వెనకాల్నించి వొచ్చి పీపుమీదనుంచి కావిలించు కున్నాడు. హఠాత్కారంగా లేచి విదిలించుకుని అతని వంక కోపంతో చూస్తో నుంచుంది. ఆ కళ్ళు చూసేటప్పటికి అతని మనసు స్వాధీనం తప్పింది. వాటిని అతనిమీది మోహంతో మత్తెక్కించాలి. సిగ్గుతో అవి అతని ముందు మూతపడాలి. అందాకా అతనికి శాంతి వుండదు. గర్వంతో

కొవ్విన ఆ వక్షం అతనికోసం, అతని ప్రేమకోసం పూగిపోవాలి. అతని పూర్వులు అడివి జాతివారై ఆడవాళ్ళని వెంబడించిన ఆవేశాలన్నీ అతని హృదయాన్ని కలవరపెట్టాయి భాష తెలీదని కూడా మరిచిపోయి.

"యెందుకంత కోపం?"

అని దగ్గరికి వెళ్ళాడు. కొట్టడానికి సిద్ధంగా గుప్పెడు పట్టింది. జంకి నుంచున్నాడు. వెళ్ళమని సౌజ్ఞ చేసింది. అతను కదల్లేదు. చెయ్యి పట్టుకుని నడుంమీద చెయ్యేసి చెట్ల బైటికి తీసికెళ్ళి, కాలిబాట దగ్గిర ఒక తోపు తోసేసి వెనక్కి వెళ్ళిపోయింది. ఇంక మళ్ళీ యేమని వెనక్కి వెడతాడు.

యింత అవమానం జరిగినా అతని కోర్కె మాత్రం మరింత హెచ్చుగా కాల్చివెయ్యడం మొదలుపెట్టింది. ఆమెని గురించే ధ్యానం ఆ గుండ్రని చేతులు ఆ ముద్దులొలికే వక్షము తీరు. చొక్కాపైన కనపడ్డ కంఠపు వొంపు. ఆ మెరిసే చూపు, పెదవులలో అమాయకపు నవ్వు. అదే ఆలోచన. ఒకసారన్నా ఆమె తనకి కావాలనే వాంఛ అతనికి వొక్క నిమిషం విశ్రాంతి నివ్వలేదు. కాని ఆశ లేదని మాత్రం పూర్తిగా తెలుసు అయినాగాని ఆ విషయాన్ని అతని మనసు వొప్పుకోలేదు.

రెండు నెల్లయింది. కాముడి పూర్ణిమ రోజున అతనూ తమాషా చూస్తో వూళ్ళో తిరుగుతున్నాడు. వెన్నెట్లో గాడిదలకి తాటాకులు కట్టి మంట పెడుతున్నారు. వాటిమీద యెక్కి షికార్లు కొందరు యెర్రనీళ్ళు ఆడవాళ్ళూ మొగవాళ్ళూ చల్లుకుంటున్నారు. ఆవాళ రాత్రికి చాలమంది సిగ్గూ, నీతి వొదిలి పెట్టినట్టు కనపడ్డది. ఆ వెన్నెలా, వసంత కాలము సాయంత్రపు గాలీ, అతను చూసిన వాళ్ళ ఆనందమూ మనసుని కలవర పెట్టాయి. పన్నెండింటికి విసిగెత్తి చెరుకు చేనులో వున్న అతని పాక దగ్గిరికి వెడుతున్నాడు. కాలవ దాటి మామిడి తోపులోంచి నడుస్తున్నాడు.

ఆ తోటలో వున్న రైతుకూలి వాళ్ళు కూడా ఆడవాళ్ళూ మొగవాళ్ళూ పిల్ల లూ పాటలు పాడుతో ఒకరి నొకరు వెంబడించి చెట్ల చీకట్లోలో మాయమవుతో ఆనందిస్తున్నారు. తోటదాటి పొలం దగ్గిరికి చేరుకునేటప్పటికి చివరనున్న మర్రిచెట్టుకింద యిద్దరు నుంచున్నట్టు కనపడ్డారు. తెల్లని బట్టలు కట్టుకున్న మొగవాడు ఒక స్త్రీని బలవంతంగా కిందికి లాగుతున్నట్టు కనపడ్డది. ఇండియా దేశపు స్త్రీల ప్రాతివత్యమూ. ఆ పాతివ్రత్యాన్ని వుపన్యాసాల్లో పొగడడమూ, మొత్తానికి తనకిప్పుడు నీతీ, దుర్నీతీ లేని అవస్థ కలగడమూ తలుచుకొంటో తల వొంచుకుని నడుస్తున్నాడు. యాభై గజాలు వెళ్ళాడో లేదో కెవ్వున కేక వినబడ్డది. తనకెందుకని నడుస్తున్నాడు. మళ్ళీ వినబడ్డది సహాయానికి రమ్మని పిలుస్తున్నట్టు జాలిగా. వెనకాలికి పరిగెత్తాడు. ఆ స్త్రీని వాడు కిందపడేసి మీద పడ్డాడు. వాడితో ఆమె పెనుగులాడుతోంది. కళ్ళు తెరిచి చూసేటప్పటికి యితను ఒక అమ్మాయి వొళ్లో పడుకుని వున్నాడు. తల దిమ్మెక్కినట్టుంది. బలహీనంగా వుంది. వాడు యితని తలమీద కొట్టి పారిపోయినాడనుకున్నాడు.

"యేమయింది?" అన్నాడు కదలక హాయిగా పడుకుని. ఆమె యేమిటి అంది. అతనికి తెలీలేదు. హృదయం కొట్టుకుంది. యెవరిది? లేచి యిద్దరూ వెన్నెట్లోకి వొచ్చారు. ఆమెకీ అనుమానం కలిగినట్టుంది. వొకళ్ళ మొహం వొకరు చూసుకుని గుర్తు పట్టారు. ఆమె మొహంలో కొంచెం కోపం కనపడి, వెంటనే పోయింది. వెంటనే పైకి నవ్వేసింది.

ఇంకా బలహీనంగా వుంది. నుంచోలేక పోయినాడు. లేకపోతే ఆ అమ్మాయిని చూసేటప్పటికి లేని బలహీనం వొచ్చిందో కూలబడి కళ్ళు మూసుకున్నాడు. పక్కన తను కూచుని. ఆతన్ని తనమీద ఆనించుకుంది. ఇంక ఆ రాత్రికి కదల కూడదనుకున్నాడు. కళ్ళు తెరిచినపుడల్లా మొహం వొంచి ఆతని కళ్ళల్లోకి చూస్తుంది. అతని చేతిని ప్రతి నిమిషమూ తాకి చూస్తుంది. ఏమేమిటో అతని చెవులో మాట్లాడుతుంది.

తలనీ, వీపునీ మెత్తగా తాకుతుంది. మంచుతో చుట్టూ తడిగా వుంది. చివరికి ఆమె లేచి అతని చెయ్యి పట్టుకుని రమ్మంది. అతను తన పాకవేపు చూసి రమ్మన్నాడు. అతన్ని భద్రంగా పట్టుకుని నడిపిస్తో వెళ్ళింది. ఆ రాత్రి కొత్తగా కోసిన చెరుకు చెత్తలో నిద్రపోయినారు.

మూడు రోజులు అతని దగ్గరే వుంది. అప్పుడప్పుడు వాళ్ళని కని పెడుతో యెవరో దూరంగా తిరుగుతున్నట్లు అతని కనుమానం తోచింది. పొలంలో పనిచేసే కూలి దాని చాత ఆ అమ్మాయితో మాట్లాడించాడు.

ఆ అమ్మాయి పేరు సుగంధి. ఒకడు ఈమెని పట్టాలని తిరుగుతు న్నాడు. సుగంధి అన్న అతనికి ఆమె నిస్తానన్నాట్ట. కాని ఈ అమ్మా యికి మాత్రం వాడిష్టం లేదు. ఫొక నెలనించి యెప్పుడు సుగంధిని వశం చేసుకోవాలా అని ప్రయత్నాలు చేస్తున్నాడు. అక్కడ వుండటం అపాయ కరమనీ, యే రాత్రన్నా అతన్ని, ఆమెనీ కూడా వాళ్ళు యేమన్నా చెయ్యొ వొచ్చనీ చెప్పింది. తన యింటికి వెడతానంది. సుబ్రమణ్యానికి ఆమెని వెళ్ళనియ్యాలని యేమాత్రం లేదు. కాని యేమి చేసుకుంటాడు? అక్కడ వుండడం అపాయకరం.

ఒకరోజు రాత్రి వాడు సుగంధిని లాక్కెళ్ళాలని చూశాడు. ఇంతలో కూలివాళ్ళు, సుబ్రమణ్యం అందరూ లేచేటప్పటికి సుగంధి అన్నని తీసు కొస్తానని బెదిరిస్తో వెళ్ళిపోయినాడు. మర్నాడు పొద్దున్న సుబ్రమణ్యం వెళ్ళి పోలీస్ యిన్స్పెక్టరుతో మాట్లాడాడు. లంబాడీలతో తగాదాలు చాలా అపాయకరమనీ, ఆ అమ్మాయిని పంపివెయ్యమనీ,ఆయన సలహా చెప్పాడు. అతను యీ సలహాకా నీ దగ్గిర కొచ్చిందనుకుని పొలంలోకి వెళ్ళి ఆలో చించాడు. అతను సుగంధితో కూడా వెంటనే అతని వూరు వెళ్ళిపోవడం తప్ప వేరే మార్గం కనిపించలేదు. సుగంధి అతనితో రావడానికి సంతో షంగా వొప్పుకుంది. ఆనాడే చెరుకు పొలాన్ని నష్టానికి అమ్మేసి వాళ్ళ

వూరికి బయలుదేరారు. చీరా రెవికా కొని ఆ లంబాడీ గుడ్డలు విప్పేసి వాటిని కట్టుకోమన్నాడు. అవి కట్టుకోడానికి ఆమె పడ్డ తంటాలూ, చీరె కట్టుకోడం, కట్టడం తెలీని అతను ఆమెకి కట్టుకోడం నేర్పడానికి పడ్డ శ్రమా విచిత్రంగా వున్నాయి. యేమన్నా సరే రెవిక వేసుకోనంది. చివ రికి అతని షర్టు వొకటిపైన వేసుకుంది. సుగంధికి ఆ వేషం యెంత తమాషాగా వుందనీ! ఆ జడలన్నీ విప్పించి ఒకటిగా వేసుకోడం నేర్పాడు. ఇంతకీ అన్నీ సౌజ్ఞలే! ఒకరి మాట ఒకరికి తెలీదు.

వాళ్ళ వూళ్ళో అగారు ధైర్యంచేసి వెంటబెట్టుకుని అతని ఇంటికి తీసుకు వెళ్ళాడు. దోవ వెంబడి అందరూ ఆమెకేసి వొకటే చూస్తారు. బండి యెక్కమంటే యెక్కలేదు. అతని పక్కన నడుస్తోంది. ఆ షర్టు లోంచి, పిచ్చిగా కట్టుకున్న చీరెలోంచి పుట్టినప్పటినుంచి గాలిలో ఎండలో పెరిగి కసరత్తుకు అలవాటైన ఆ దేహం. పైకి కనపడి అందరి దృష్టిని ఆపేసింది. పదిహేనేళ్ళకే మూడు కానుపులై, పది గంటలు పొయ్యి దగ్గర పొగ పీలుస్తో, యెండనెరక్క పాలిపోయిన స్త్రీల కలవాటు పడ్డవాళ్ళకి సుగంధి కొత్తగా కనపడదూ?

సుబ్రహ్మణ్యం తల్లి "యిదెవత్రా?" అంది. సుగంధి కొయ్యగాజులూ, చెవలకి పెద్ద కమ్మలూ, జుట్టు ముడ్నా తీసెయ్యలేదు. యెవరో తెలుసు కుని, తిట్లు మొదలుపెట్టింది ఆమె. అతని అన్న మొహం తిప్పుకుని మాట్లాడకండా దుకాణానికి వెళ్ళిపోయినాడు. అయిదు వందలూ ఈ పిల్ల కోసం తమ్ముడు తగలేశాడని అతనికి అర్థమయింది. లోకంలోకల్లా అందవికారంగా వుండే వంకర వాదినతో పెళ్ళిలో ఊరేగడానికి పూల పల్లకీకి అయినాయి ఐదు వందలు! సుగంధికోసం రెండు వందలు నష్టం కావడం అన్యాయమా?" అనుకున్నాడు సుబ్రహ్మణ్యం. సుగంధిని యింటో

వుంచడానికి యెవరూ వొప్పుకోలేదు. పంపెయ్యమన్నారు. సుబ్రమణ్యం తను కూడా వెళ్ళిపోతానంటే "సరే, నీ యిష్టం వొచ్చినచోట పెట్టుకో, యింటో మాత్రం వొద్దు" అన్నారు. వాళ్ళ తోటలో పశువుల పాక బాగు చేయించి దాంటో వుంచాడు సుగంధిని.

ఇంక మర్నాటినించి అతని అవస్థలు ప్రారంభమైనాయి. ఎవరో పాకీ పిల్లని లేవదీసుకొచ్చాడని వూరంతా గోల. రోడ్డుమీద అందరూ అతన్ని చూసేవారే. ఎటువంటిదైనా సరే, లేవదీసుకొచ్చిందైతే రూపమూ, గుణాలు యెట్లాంటివని ఆలోచించే వారుండరు. అధమమైన జాతికి చెందిందనే ప్రజల అభిప్రాయం.

సుబ్రమణ్యం అత్తవారిది ఆ వూరే. అవుపోసనం చేసి పిల్లని పంపాలనుకుంటో వుండగా యీ సంగతి జరిగింది. వాళ్ళు వొకటే రొద. వర్తకం తగలేసి డబ్బంతా యీ పిల్లకి పెడతాడేమోనని వాళ్ళ అన్నయ్య బెంగ. వూరి వాళ్ళకంతా యీర్ష్య. ఇట్లాంటి అపరిదిష్ట అతని అన్నకి చాలా అసహ్యం. దివాలాలూ, వర్తకంలో అన్యాయం. మొహం మీదే తిట్లూ అన్నీ భరిస్తాడు గాని, ఆడదానికోసం త్యాగం అతనికి అర్థంకాదు. అందులో అపరిదిష్ట కానీ వర్తకం కోసమైనా, యిల్లు వొదిలి ప్రయాణం మంటే ఆ అన్నకి భయం. సుబ్రమణ్యానికి సరదా కనక సుబ్రమణ్యంతో విరోధం పెట్టుకోడం లాభకరం కాదని మాట్లాడకుండా వూరుకున్నాడు.

కొద్ది రోజుల్లో అంతా సద్దు మణిగింది. సుబ్రమణ్యం అన్నకూడా ఒకటి రెండుసార్లు సుగంధిని పలకరించాడు. వొచ్చీరాని భాష సుగంధి మాట్లాడితే వినడం అతనికి సరదా. పల్చని చీరెలూ, ఒక అద్దం ఆమెకి కొనిచ్చాడు. వొదిన కూడా ఆమె స్నేహం చేసుకుంది. కాని తన అందానికి తోడు ఆ వదిన సుగంధికి మొగ నడకనీ, దబ్బముక్కనీ, వొస్తాదనీ యెక్కిరిస్తే సుబ్రమణ్యం వొళ్ళు మండేది. సుగంధిని చూస్తే అతనికి

దిన దినమూ మోహ మెక్కువవుతోంది. అనుభవించిన కొద్దీ యింకా యిష్టమెక్కువయింది. అంత అందం అతను పదాల్లోకూడా చూడలేదు. కాపరం చెయ్యకపోయినా అంతకు ముందు అందమైన ఆడవాళ్ళ వొళ్ళెట్లా వుంటుందో యెరుగును. కాని యిట్లాంటి అందం వుంటుందని కలలో కూడా అనుకోలేదు.

ఒక్కొక్కప్పుడు సుగంధిని చూస్తే మనిషి కంట పడకంగా బెదిరి పారిపొయ్యే విచిత్రమైన అడివి మృగాలు జ్ఞాపకానికి వొచ్చేవి. చిరత పులి వొళ్ళు విరుచుకుంటే వొచ్చే చంచలమైన అందం. అడివి పావురం మెడ కదిలిస్తే వొచ్చే అలల మోస్తరు రంగు సొగసు సుగంధి నడుము వొంచినా, మెడ యెత్తినా కనపడేవి ఆ కళ్ళలో మెరుపూ చలనమూ, భయం, ఆనందం, ప్రేమా, చిన్న పిల్లల కళ్ళల్లో వలె మారుతో కనపడేవి. ఇంక ఆమెకి మోహం వొచ్చిందంటే సారాయివలె మత్తెక్కించి, నలిపి, రక్తంలో సారమంతా ఆనందంగా మార్చి మనిషినీ, పశుత్వాన్నీ, దేవత్వాన్నీ, ఒక్కసారి పొందిస్తుంది. చేతులు తల వెనక పెట్టుకుని వొళ్ళు విరుచుకుంటే, నల్ల తాచు పడగవిప్పి కాటువెయ్యడానికి లేచిన గాంభీర్యం కనపడేది.

యేమి ఆమె పని చేసేది కాదు. చెయ్యబోయినా చాతగాదు. వూరికే తోటంతా తిరగడం యిష్టం. బోనులో సింహం తిరిగినట్టు. సుబ్రమణ్యం కనపడగానే ఆమెకి శాంతి వొచ్చేది. చీరెలమీదా, నగలమీదా, డబ్బుమీదా, పువ్వులమీద యేమి కోర్కెలేదు. వాటిని చూసి అక్కడే పారేసేది. ఒక చీరెకీ యింకో చీరకీ విలవలో భేదమే తెలీదు. తన వొంటి అందం, శృంగారం యేమి చాతకావు.

వానా, గాలీ, యెండా, మంచూ. చెట్ల నీడలూ, వెన్నెలా వీటిని చూసి కట్టేసిన మృగంలాగు పెనుగులాడేది. వెన్నెల రాత్రి వొచ్చిందంటే

తెల్లార్లు అతన్ని కూడా తోట అంతా తిప్పేది. పూరి బయట పొలాల్లో నడిపించేది. తన కొండలకోసం, వాగుల కోసం, అడవుల కోసం వెతుకు తున్నట్టు యిటూ అటూ తిరిగేది.

సుబ్రమణ్యం అత్తవారు అతని కార్యం ప్రస్తావన అన్నయ్యతో యెత్తారు. అన్నయ్య సుబ్రమణ్యాన్నడిగితే "సరేలే! మీ అందరి యిష్టం" అన్నాడు. ఇంకేమి అంటాడు? వేళాకోళానికి సుగంధితో "నా శోభనం" అన్నాడు. సుగంధికి తెలుగు అర్థం చేసుకోడం వొచ్చింది.

"అంటే?"—

"నాకు పెళ్ళాం వొస్తుంది."

ఇద్దరూ బాదం చెట్టుకింద కూచుని నక్షత్రాలవంక చూస్తున్నారు. ఆలోచిస్తో మాట్లాడకంటా పూరుకుంది. కొంచెంసేపు వుండి—

"అయితే నేను వెళ్ళిపోవాలా?" అంది.

"వెళ్ళి పోవాలి" అని చెప్పి చూద్దామనుకున్నాడు. కాని ఆ కంఠంలో కన్నీళ్ళ మార్దవం వినేటప్పటికి అతనికింక ఆ మాటనడానికి నోరు రాలేదు. మెడమీద చెయ్యేసి దగ్గరికి లాక్కుని ముద్దుపెట్టుకున్నాడు.

"నా దగ్గరి నించి యెక్కడికి వెళతావు? యెందుకు వెళ్ళడం?"

"యెప్పుడన్నా నన్ను పొమ్మంటావా?"

"నిన్ను వొదిలి యెట్లా బతుకుతాను? యెన్నుడూ ఆ మాట అనుకో నన్నా అనుకోకు."

సుబ్రమణ్యం కార్యానికి యెట్లానూ వొప్పుకోడని నిశ్చయించుకుని అతను అక్కర్లేదనగానే గోల చెయ్యవొచ్చు కదా అని అత్తవారు అట్లా అడిగారు. ఇతను వొప్పుకునేటప్పటికి వాళ్ళు పూరుకున్నారు. కొన్ని రోజులు చూసి అన్నయ్యే వాళ్ళని అడిగాడు.

"ఆ ముండని వొదిత్తేనేగాని మా అమ్మాయిని పంప"మన్నారు. సుబ్రమణ్యం "పంపనక్కర్లేదు. మీకు అనేకవేల నమస్కారాల"న్నాడు. ఆ అమ్మాయి యెట్లా వుంటుందో కూడా మరిచిపోయినాడు. యెట్లాంటిదో అసలు యెరగనే యెరగడు. అతనికేం దిగులు?

మూడు నెల్లయింది. వాళ్ళ పిల్లని అసలు వొదిలేస్తాడేమోనని ఆ అత్తవారికి బెంగ పట్టుకుంది. మళ్ళా అల్లరి మొదలుపెట్టారు. యెట్లానన్నా సుగంధిని వొదిలేట్టు చెయ్యాలని. కాని వూళ్ళోవాళ్ల కూడా యివ్వరు. వాళ్ళ మాటలు వినడం మానేశారు. యెన్నాళ్ళని? విసుకు. సుగంధి అతని భార్యగానే అందరికీ కనపడుతోంది. ఆమె అందమూ, నిర్మలత్వమూ, బేలతనమూ చూసిన వాళ్ళందరికీ ఆమె మీదే దయ. వర్తకం తప్ప తలలో యింకేమీలేని అన్నయ్యకు కూడా సుగంధిని చూస్తే యిష్టం.

"వుంటే వుంది మీ అమ్మాయిని పంపండి. ఆయన పాపం పనికి రాదనటం లేదుగా? మీ అమ్మాయిని పంపిం తర్వాత యీ ముండని తెచ్చుకుంటే యేం చేసేవారు?" అని అత్తవారిని అందరూ అన్నారు. సుబ్రమణ్యం బావమరిదికీ మామగారికీ పిచ్చియెత్తినట్టయింది. వాళ్ళ ముత్తాత కాశీకి వెళ్ళాట్ట. అన్న కొడుకు కోర్టు మునసబుట. ఈ రెండు కారణాల పట్టి వాళ్ళ అమ్మాయిని యితని దగ్గిరికి పంపితే కలగబోయే అవమానాన్ని సహించలేక పోయినారు.

ఒకసారి వ్యాపారం నిమిత్త సుబ్రమణ్యం మామూలు ప్రకారం బొంబాయి వెళ్ళాడు. తిరిగి వొచ్చేసరికి సుగంధి కనపడలేదు. ఒక రాత్రి తోటలోకి యెవరో వొచ్చినట్టయిందనీ, సుగంధి కేకలు వేసిందనీ, తాము పరిగెత్తి వెళ్ళేటప్పటికి సుగంధి కాని యింకెవరు కాని కనపడలేదనీ తోట కాపరివాళ్ళు చెప్పారు. యెవరి నడిగినా వాళ్ళకేమీ తెలీదన్నారు. సుబ్రమణ్యానికి పిచ్చెత్తిందనుకున్నారు. వూరికే తిరగడం, అందరినీ అడ

గడం, యెవరితో మాట్లాడకండా కూచోడం. యేం చేస్తాడు? చంపేసారో? తనే వెళ్ళిపోయిందో? ఆ తోటలోకి వెడితే ఆమె వున్నట్టే వుండేది.

నెల రోజులయింది. సుబ్రమణ్యం సుగంధిని ఒక్కరవ్వ మరిచిపో లేదు. రోజు రోజూ అతని వ్యసనం యెక్కువవుతోంది. చాలా చిక్కి పోయినాడు. అన్నం తినడు. ఇంటికి రాడు. ఒకరాత్రి వూరిబైట తిరుగు తున్నాడు. ఆ నక్షత్రాలనీ, చీకటినీ, చూసి చూసి సుగంధిని వెతుకుతాడు. సుగంధి తనమీద యెట్లా చెయ్యి వేసేదో, చీకట్లో తనవంక యెట్లా చూసేదో జ్ఞాపకం తెచ్చుకుంటాడు.

తోట లోపల తెల్లవారె ఓ గుమ్మం దగ్గిర ఇద్దరు లంబాడీ బిచ్చ గాళ్ళ మళ్లే కూచున్నారు. సుబ్రమణ్యానికి చాలా ఆశ కలిగింది. సుగంధి పంపించింది గావును. అతన్ని చూడగానే ఓ లంబాడీ పిల్ల పరిగెత్తుకు వొచ్చి కావిలించుకుంది. యెవరు? సుగంధి. సుబ్రమణ్యం కళ్ళు తిరిగాయి. అతనికి వొళ్ళు తెలీలేదు. అంత మురికిదాన్ని అందరిముందూ కావిలించు కుని యేడ్చాడు. సంతోషంతో. పక్కే లంబాడీ గుడ్డలు కట్టుకుని వుంది. జుట్టు అంతా జడలు కట్టింది. అంతా మురికి. గుర్తు పట్టటానికి వీలులేదు. "యెక్కడికి వెళ్ళావని" అడిగాడు. సుబ్రమణ్యం వెళ్ళిపోయింతర్వాత ఒక రాత్రి యెవరో యిద్దరు మొగాళ్ళు సుగంధిని లేపి సుబ్రమణ్యాన్ని విడిచి మాయమౌతావా, చంపెయ్యమా అని కర్రలతో బెదిరించారట. జవాబు చెప్పకుండా ఆ కర్రలు తటాలున లాక్కుని యిద్దరినీ నెత్తిమీద బాదింది. ఇద్దరూ కిందపడ్డారు. వాళ్ళవాళ్ళన్నా, పోలీసులన్నా తనని పట్టు కుంటారని భయంవేసి పారిపోయింది. సుబ్రమణ్యం బొంబాయి నించి వొచ్చేటప్పటికి తన మామా, బావమరిదీ తలలు పగిలి ఆస్పత్రిలో పడు కుని వుండడం సుబ్రమణ్యానికి జ్ఞాపకం వొచ్చింది. సుబ్రమణ్యం తిరిగి వొచ్చిందాకా సుగంధి యెక్కడన్నా దాక్కోవాలనుకుంది. ఇంతలో

లంబాడీ గుంపొకటి కనబడితే వాళ్ళతో కలిసి అడవులూ, కొండలు తిరి గింది. తృప్తి కలిగేట్టు ఆ కొండవాగుల్లో యీదీ, ఆ చల్లని గాలి పీల్చి తిరిగితేనే గానీ, మళ్ళీ రావటానికి బుద్ధి పుట్టలేదు. సుగంధితో వొచ్చిన వాణ్ణిచూసి అతను యెవరని సుబ్రమణ్యం అడిగాడు. వాడు చాలా బలంగా, పొడుగ్గా వున్నాడు.

"మావాడే. ఒక్కదాన్ని రావటానికి భయపడి వెంట తీసుకొచ్చా నంది."

యెప్పటివలె ఆ తోటలో వున్నారు. ఆ వొచ్చిన మనిషి యెన్ని రోజులైనా వెళ్ళలేదు. పగలంతా యెక్కడో తిరిగేవాడు. తినేవాడు. రాత్రి చెట్లకింద పడుకుని నిద్రపోయేవాడు. ఎవరితోనూ మాట్లాడడు. సుబ్ర మణ్యం పలకరించినా పలకడు. వాడు యింకా వెళ్ళిపోడేం అంటే "వెడ తాడు. తొందరేం?" అంది సుగంధి.

సుగంధిని వొంటరిగా మళ్ళీ తోటలో వుంచడం సుబ్రమణ్యానికి ఇష్టంలేదు. తన ఇల్లు భాగం పంచుకుని సుగంధిని అక్కడే వుంచుకోవా లను కున్నాడు. కాని సుగంధి రానంది. పోనీ తను వొచ్చి తోటలో వుంటానన్నాడు. దానికీ యేమైనాసరే ఆమె వొప్పుకోలేదు. సుబ్రమణ్యం బంధువులకి తనమీద కోపం వస్తుందని కారణం చెప్పింది. పైగా ఆ కొత్తగా వొచ్చిన మల్లన్న కావిలి వుంటాడు కదా భయం లేదంది. వాడు అట్లాగే వుండేవాడు. సుగంధి వేలు కదిలిస్తే చాలు కుక్కవలె పరిగెత్తుకు వచ్చే వాడు. కుక్కవంటి విశ్వాసం వాడి కళ్ళల్లో సుగంధి వంక చూసినప్పుడల్లా కనపడేది. సుగంధి కోసం నిప్పులో దూకుతాడా అన్నట్టుండేది. కాని సుబ్రమణ్యానికి అప్పుడప్పుడు పెద్దపులి కళ్ళమల్లే మెరుస్తున్న ట్టుండేవి, వాడివి. వాడిమీద అతనికి అయినా దయే. తన పాత కోటొకటి

యిచ్చాడు. కాని వాడు తీసుకోలేదు. తోటలో పనిచేస్తే అన్నం పెట్టి జీత మిస్తానన్నాడు. వొప్పుకోలేదు వాడు.

ఇట్లా రెండు నెలలు జరిగిపోయింది. మళ్ళీ సుబ్రమణ్యం బొంబాయి వెళ్ళవలసి వొచ్చింది. సుగంధిని కూడ వెంట తీసుకుని వెళ్ళా లని నిశ్చయం చేసుకున్నాడు. సుగంధి రానంది. బొంబాయి తమాషాలన్నీ చెప్పి చూడడానికి బొంబాయి రమ్మన్నాడు. కాని ఆ పట్నపుగాలే యిష్టం కాదు సుగంధికి. మల్లన్న వున్నాడు. ఏం భయంలేదు. వెళ్ళమంది. సరిగా మళ్ళీ బుధవారం రాత్రి తప్పకండా వొస్తానని చెప్పి వెళ్ళిపోయినాడు. కాని బొంబాయి వెళ్ళిన రోజు నించి సుబ్రమణ్యానికి యింటిమీదే ధ్యాస. ఏదో భయిం పట్టుకుంది. ఆ మొద్దు మల్లడు సరిగా కావిలి వుంటాడో లేదో? యెవరన్నా లంచం యిస్తే లొంగిపోతాడేమో! చాలామంది వొచ్చి వాణ్ణికూడా తన్ని, కోపం మీద సుగంధిని యేమన్నా చేస్తారేమో! సుగంధి కంటే లోకమేముంది? వెధవ వర్తకం పోతే యెంత? వుంటే యెంత? అసలు ఆమెని అక్కడ వొదిలి, తను బొంబాయి రావటం చాలా తప్పు పని అనుకున్నాడు. నిద్ర లేదు. అన్నం సయించదు. వ్యవహారం మీద అసలు బుద్ధిలేదు. ఇంక అక్కడవుండి యేంలాభం? రెండురోజులున్నాడు. ఒకరవ్వ పని చెయ్యలేదు. ఇంటికి వెళ్ళి సుగంధిని యెట్లానన్నా వొప్పించి తీసుకుని మళ్ళీ బొంబాయి రావాలనుకుని యింటికి ప్రయాణమైనాడు.

రాత్రి వొంటి గంటకి మెయిల్ దిగాడు. ఏ నిమిషాన సుగంధిని చూస్తానా అని వుంది. వెళ్ళేటప్పటికి వుంటుందో? వుండదో? ఆ పెట్టా పరుపూ స్టేషన్‌లోనే వొదిలి పట్టాలు దాటి వొంతెన మీదిగా పోయి తోట చేరుకున్నాడు. కాళ్ళు వొణుకుతున్నాయి. ప్రాణప్రదమైన సుగంధి చీకటి చేరని గుహల్లో వుండే మృగాల అందంగల సుగంధి సముద్రం అలలు శంఖాలమీద అద్దిన వొంపులుగల సుగంధి తనమీద అంత మక్కువగల సుగంధి కనబడకపోతే యెట్లా బతికి వుండటం?

తోటలో పాక దగ్గిరికి వెళ్ళాడు. చుట్టూ తిరిగి తలుపు దగ్గిరికి వెళ్ళడానికి తొందర. ముందు కిటికీ కనపడగానే అగ్గిపుల్ల గీసి లోపలికి చూశాడు. అట్లాగే ఆగిపోయినాడు. అగ్గిపుల్లంతా కాలి చెయ్యి వేడెక్కింది. వేళ్ళ కాలి పుల్ల ఆరిపోయింది. తను కూడా తేరిపార చూడడం తప్పనుకునే ఆ నడుము అంగమంతా కనపడుతో. సుగంధి ఆ మృదువైన, బలమైన చేతుల్ని మల్లన్న మెడ చుట్టూ వేసి అతని చేతుల్లో అలిసి నిద్రపోతుంది. బయటికి వచ్చి మంచు చల్లదనంలో నుంచున్నాడు. సుబ్రమణ్యం మనసులో ఆలోచన పూర్తిగా ఆగిపోయింది. తలమీద పెద్దదెబ్బ తిన్నట్టయింది రెండు నిమిషాలు. అంతా జ్ఞాపకమొచ్చింది. రక్తం హృదయం దగ్గిరికి చేరుకున్నట్టు బిగపట్టింది. ఊపిరాడలేదు. పరిగెత్తుకు పోయినాడు. ఎక్కడికో, యెక్కడికో చీకట్లో మాయమైనాడు. తెల్లార్లు సంధిలో వున్నట్టున్నాడు. ఆ యిద్దరిమీదా యెంత కోపమొచ్చింది. తిరిగి వెళ్ళి ఇద్దర్నీ లేపి చంపివెయ్యాలని నిశ్చయించుకున్నాడు. ముఖ్యంగా సుగంధిని ముక్కలు ముక్కలుగా కొయ్యాలని అనిపించింది. అట్లాకాదు. చంపితే కసి తీరదు. మర్నాడు యెట్లాగో తోటలోంచి మల్లణ్ణి వెళ్ళగొట్టి వాడెక్కడా లేకండా చేసి, లేకపోతే వాణ్ణి చంపి, ఆ తలనో దేన్నో సుగంధికి కనపరిచి, యేడిపించి, రక్తం కార్చి, సుగంధిని తనదాన్ని, తన దాసీని, బానిసని చేసుకుని, తన కాళ్ళమీద పడి పశ్చాత్తాపంతో కుళ్ళేటట్టు చేసి, అప్పుడు తనకి అక్కరలేదని వెళ్ళకొట్టేయాలనిపించింది.

తెల్లారకట్టకి ఒక లాకు గట్టు చేరి అక్కడ కూచున్నాడు ముందు. శుక్రుడు వెలుగుతో ప్రవహించే నీళ్ళలో పొడుగ్గా కరిగిపోయినట్లు మెరుస్తున్నాడు. అప్పుడే కోయిల కూసింది. తూర్పు కొంచెం తెల్లనయింది.

నడినెత్తిన వున్న మబ్బు యెర్రగా నీళ్ళలో ప్రతిఫలిస్తోంది. చల్లని గాలి అతనికి హాయి నివ్వలేకపోయింది. లోపల దుఃఖం కసి మండిపోతు న్నాయి.

ఆ కొత్త కాంతి అతని దుఃఖాన్ని వెక్కిరించినట్లయింది. రాత్రంతా పోయినవారి కోసమేడ్చి పొద్దున్నే కాంతిని చూస్తే కలిగే అస హ్యమూ భయమూ అతనికి కలిగాయి. సిగ్గువేసింది. ఇంకా యే చీకట్లోనో తన దుఃఖంతో పడుకోవాలనిపించింది. లాకుల్లోంచి ఒక ముసలామె ఆవుకి పాలు పితకడానికి వొచ్చింది. లోకంమీద నమ్మకం. ఆశ. ఆనందం. అన్నీ పోయినట్లు కూచుని వున్న యితన్ని చూసి యేమనుకుందో యేమో. గిన్నెతో నురుగుపాలు తెచ్చి యిచ్చింది.

"యెందుకు నాకిట్లా యిస్తావు?"

దగ్గర కూచుంది.

"పాపం! యేదో చాలా కష్టంలో వున్నట్టున్నావు. నేనూ యెరుగు దును. చెప్ప వాలనీక మనసును తినేసే బాధని. నీ మీద జాలి, విరోధుల కన్నా వొద్దు ఆ బాధ."

అతని దుఃఖమంతా తిరగబెట్టినట్లయింది. యెవరితో చెప్పుకుంటే యెవరు వింటారు? యే భార్యో లేచిపోతే అందరూ వోదార్చేవాళ్ళే. అంతా ఆమెతో చెప్పేశాడు.

"ఆమెకా మల్లడి మీద యిష్టం గావును" అంది.

"అయితే నాతో యెంతో ప్రేమగా వున్నట్లు నటించడమెందుకు?"

"తప్పే. పాపం. ఆడది-నీతో చెప్పడానికి ధైర్యం చాలలేదు

గావును............అయినా నాయనా! ఆడవాళ్ళని తెలుసుకోడం చాలా కష్టం. ఒక రాత్రికి యే కారణంచేత నువ్వు వూహించలేని కారణం వల్ల అతనికి లోబడి వుండవొచ్చు."

"అయితే నన్నిప్పుడు వూరుకోమంటావా?"

"యేం చేస్తావు?"

"వాళ్ళిద్దర్నీ యేదో వొకటి చేస్తాను."

"నాయనా. నా మాట విను. తొందరపడి యేం చెయ్యకు. తర్వాత యేడుస్తావు."

"తొందర పడేదేముంది?—చేసిన పాడుపని కనపడుతూ వుంటే నే కళ్ళారా చూస్తినిగా? నేనూరుకుంటానా? యింత ఘోరం చేసింతరువాత నేనూరుకుంటానా ?

ముసలమ్మకి కోపం వచ్చింది.

"యేం? యేం చేసింది? వాళ్ళ వాళ్ళందరినీ వొదిలి వొచ్చి నీతో వుండడం న్యాయమయిందీ? లంబాడీవాడితో వాళ్ళ వాడితో వుండడం తప్పయిందీ? యే శాస్త్రప్రకారం? నీ భార్యని వొదిలేసి, దీన్ని పెట్టుకున్న పాప ఫలం నీకు తగలదూ? ఆ యీడొచ్చిన పిల్లని వొదిలేశావే. అది యేం బాధ పడుతుందో?"

"నీ కిష్టం లేకపోతే పంపెయ్యి. ఇంకేం చెయ్యకు."

చంపెయ్యాలని వుందిగాని, పంపెయ్యాలని లేదు. అమ్మా! నా సుగంధి వొళ్ళు చొక్కా లేకండా యెవరన్నా చూశారంటే నే భరించలేనే. వాళ్ళిద్దర్నీ పంపించేస్తే. ఆ మల్లడు వెధవ ఆ అడవుల్లో చెట్లకింద, కొండకాలవ వొడ్లమీద, నక్షత్రాల కింద ఆ సౌందర్యాన్ని కావిలించు

కుంటున్నాడని తలచుకుని బతకగలదా తను? ఆ కళ్ళు ఇంకోడి కోసం మెరిస్తే, ఆ చక్కటి పెదిమలుఇంకోడితో ఆవేశంలో వొళ్ళు తెలీక ముద్దు మాటలాడతాయనే సంగతి తలచుకుని వుండగలదా? ఆమెని తన కిందే అట్టిపెట్టుకుని యేడిపించాలి-లేకపోతే చంపాలి. అంతే. తనస్త్రీ యింకోడికి దక్కకండా, తన శవంతో కూడా కాల్చే యేర్పాట్లు చేసుకున్న జలసీ - చంపటం చాతకానప్పుడు తల గొరిగించి, వికార రూపం తెచ్చి మరీ చంపే తీవ్రమైన అహంకారం, తన ప్రియురాలి మొహం యింకోడు చూస్తే చాలు, వాడి మనసులో ఆమె మీద కోర్కె పుడితే చాలు. ఆమె మైల పడుతుందని గోషాపెట్టే స్వార్థం. అన్నీ ఆ నిమషాన అతని హృదయంలో భగ్గుమన్నాయి. అన్యాయం అట్లాంటి పని. తనకామె మీద ఆమె హృదయం మీద యేం అధికారముంది? అని ఆలోచించుకున్నా ఆవేశం ఆగలేదు. యేం లేదు — ముందు వాణ్ణి చంపాలి. తరవాత ఆ దుఃఖంతో సుగంధి కుళ్ళుతో వుంటే అది చూసి ఆనందించి, దాన్ని చంపాలి - లేకపోతే యింకెవరికీ పనికిరాకండా ముక్కు చెవులూ కోసి - వొళ్ళంతా మచ్చలు చేసి పంపాలి-ఆ అందాన్నంతా యింకోడి కప్పగిస్తాడా?

"నేను వొదల్లేను—వొదల్లేను" అని తనలో తనే అనుకున్నాడు.

"అయితే యేం చేస్తావు? అయిపోయిందేదో అయిపోయింది. దూకుడు చెయ్యక మెల్లిగా మాట్లాడి వాణ్ణి వొదిలేశేట్టు చెయ్యి" అంది.

అతడు లేచి ఆలోచించుకుంటూ యింటికి వొచ్చాడు. పదిగంటలయింది. భోజనం చెయ్యకండానే తోటలోకి వెళ్ళాడు—సుగంధి యేదో పాట పాడుకుంటో పొగడ పువ్వులేరుతోంది-అతన్ని చూడగానే ఆపుకోలేని యెక్కువైన సంతోషంతో యెదురుగా పరుగెత్తుకుని వొచ్చి, ఆ పువ్వుల్ని అతని తలమీద కుమ్మరించింది.

"ఇప్పుడెట్లా వొచ్చావు? ఆకాశం మీద నుంచి నా కోసం వూడి పడ్డావా?" అని మెడ చుట్టూ ఆ ముద్దులొలికే చేతులు వేసింది. అతనికి లోపల కోపమంతా వుంది-కాని చెయ్యి ఆమె వీపు చుట్టూ అతని శక్తికి మించి అల్లుకుంది-యింత మోసమా? నిష్కళంకమనుకున్న సుగంధి హృదయంలో ఇటువంటి అద్భుతమైన అభినయమా ? ఒకవేళ రాత్రి జరిగింది కల కాదుగదా! తన భావోద్రేకమన్నా, పైత్యపు కళన్నానేమో! తన భయంతో తాను కల్పించుకున్న భ్రాంతేమో! అతని కళ్ళల్లో సందేహం చూసి, కళ్ళల్లోకి చూస్తో "మాట్లాడవేం?" అంది.

"సంగతులేమీ లేవూ?" అని స్మశానం మొహంపెట్టి అన్నాడు.

"యేముంటాయి? నువ్వు లేకపోతే షికార్లా యేమన్నానా? యేం తోచక మూల కూచున్నాను. యెప్పుడొస్తావా అని. రోజులు లెక్కపెట్టు కుంటో....

"యేం నేను లేకపోతేనేం?"

"నువ్వు బాగా అలవాటైనావు – వొక్కత్తెనీ తిరగడమంటే యిప్పుడు చాలా కష్టంగా వుంటుంది. నన్ను పూర్తిగా చెడగొట్టేశావు" అని అతని భుజం మీద తలపెట్టి యెప్పటిమల్లేనే గోము చేసింది.

"నేను లేకపోతేనేం? యెవరూ లేరూ?"

"యెవరున్నారు యింక?"

"మల్లన్న లేడూ?"

"మొద్దు–వాడితో షికార్లే? వాడికేం తెలుసు?"

కొంచెంసేపు వూరుకుని

"నా మీద నీకిష్టమేనా?" అన్నాడు.

"యెందు కిప్పుడు అడుగుతున్నావు? నువ్వు వెళ్ళింతరవాత నిన్ను తలుచుకోని నిముషం లేదు."

యేం చెయ్యాలి దాన్ని? ఆ నాలిక చీలిస్తే? తనని చూడగానే అంతా వెంటనే వొప్పుకుంటుందనుకున్నాడు.

"సరేగాని—, యిప్పుడెట్లా వొచ్చావు చెపుదు?"

"నిన్న రాత్రి వొంటిగంటకే వొచ్చా."

"అయితే యిప్పటికా దర్శనం?"

"రాత్రి రైలు దిగగానే వొచ్చాను-నిన్ను వెంటనే చూడాలని...."

సుగంధి మొహం జాగ్రత్తగా చూస్తో ఆగాడు-భయపడ్డట్టు అతనికి తోచింది.

"తలుపు దగ్గిరికి వొచ్చిందాకా వుండలేక కిటికీలోంచే అగ్గిపుల్ల వెలిగించి చూశాను."

ఆమె మొహం వెల వెల బోయింది. వెంటనే ఆమె కళ్ళల్లోకి జాలి వొచ్చింది- జబ్బుచేసిన బిడ్డని చూస్తే తల్లి కళ్ళల్లోకి వచ్చే మోస్తరు దయ. మాట్లాడకండా వూరుకుంది-

"నా కళ్ళకేం కనపడ్డదో ఆలోచించుకో—"

కదలకండా అతని వంక చూస్తో. పెదిమ కొరుక్కుంటో నుంచుంది.

"యేం?....అయితే...."

యింకా తన కాళ్ళమీద పడి క్షమించమని వేడుకోదేం? అట్లాంటి

ధైర్యం, మొండితనం, చూసేటప్పటికి అతనికి వొళ్ళు మండింది-పాగ దీసి చంపమీద కొట్టాడు—అతని చెయ్యి సుగంధి పట్టుకుంది-

"మల్లడు చూస్తాదేమో. కొట్టకు."

"చూస్తే...."

"చూస్తే? నీ మీది ప్రేమ చేత నేను వూరుకుంటా. కానీ నా మీద యీగ వాలిందంటే వాడు వూరుకోడు. నిన్ను నరికి పాతేస్తాడు చూశావంటే"

"కోపంతో అతనికి వొళ్ళంతా మంటలెత్తినట్లయింది. పెదిమలు, గొంతూ వొణుకుతున్నాయి.

"వాడు నన్ను చంపుతాడో. నేను వాణ్ణి చంపుతానో చూస్తాను.... కాని ముందు నువ్వు చేసిన పని సంగతి చెప్పు."

"చెప్పేందుకేముంది? అవును, నీకెందుకు?"

"నాకెందుకూ?"

"నువ్వు వచ్చినపుడు వాడు అడ్డం రాడుగా?"

"యిప్పుదేగా నేను లేకపోతే వుండలేనన్నావు?"

"అవును. నిజమే."

"మరి వాడు...."

'వాడూనూ."

యెట్లా?"

"నేను అబద్దం చెప్పటంలేదు."

"నాతో యెందుకు చెప్పలా?"

"వాడెంత చెప్పినా నిన్ను నేను వొదలకండా వుండడం చూసి నిన్నెట్లానన్నా చంపేసి నన్ను తీసుకుపోవాలని చూస్తున్నాడు. నా భయం చేత వూరుకున్నాడు. నాకు వాడికి వున్న సంబంధం నేను నీతో చెపితే నువ్వు వాడితో పోట్లాడక మానవు. వాడు నిన్ను చంపక మానడు అందుకని వూరుకున్నా. అంతేగాని నీతో చెప్పడం నాకేం భయం."

సుబ్రమణ్యం లోకం కూలిపోయింది.

"నిన్ను చూస్తే నాకు దిగులేస్తోంది. నీకు తెలీకండా వుంచాలను కున్నాను. ఇప్పుడు మల్లన్నని యేదో వొకటి అనక మానవు. నేను వెళ్ళిపోతే పోనీ...."

"అసలు వీడెందుకంట నీకు? అడివి మొద్దు వాడి మీద...."

"నేనూ అట్లాంటి దాన్నేగా?"

"అయితే నన్ను...."

"నిన్ను చూస్తే నాకెంతో ప్రేమ. నీతో ఆడుకోవాలనిపిస్తుంది. షికార్లు తిరగాలనిపిస్తుంది. నీ మీద వొకరకం. వాడిమీద వొకరకం. ఇద్దరూ కావాలి నాకు. అంతా చెడగొట్టేశావు. నాకు తెలీకండా యెందు కొచ్చావు? తలుపు కొట్టకూడదూ? యెందుకు చూడాలి?" యేడ్చింది.

సుబ్రమణ్యం తను అంతా మరిచిపోతాను. మల్లన్నను పంపించి వెయ్యమన్నాడు. తను వాణ్ణి వొదలలేననీ, తను వొదల గలిగినా వాడు తనను యేమైనా వొదలడనీ సుగంధి అంది. వాడు తనకు కావాలి. తన గాఢమైన ఉద్రేకాన్ని తృప్తి పరిచేందుకు వాడే కావాలి. కాని సుబ్ర

మణ్యాన్ని వొదలలేదు. మల్లన్న ఉండటం సుబ్రమణ్యానికి యిష్టంలేక తనని పొమ్మంటే పోతానంది. సుబ్రమణ్యానికి ఆలోచన తోచలేదు. సుగంధిని వొదలలేదు. కాని ఆ మల్లడి మోహం చూస్తో, తను లేనప్పుడు వాడు....యెట్లా వోర్చుకోడం?

"ఒకటి. మల్లడికి మాత్రం నీకీ సంగతి అనుమానం తట్టినట్టు కూడా తెలీనీకు. కోపం వాడిమీద యేమాత్రం చూపకు. ఈసారి మమ్మల్ని ఆ విధంగా చూసినా సరే. యేమనకండా వెళ్ళు. నువ్వు యెప్పుడు వొస్తావో చెపుతో వుంటే. అప్పటికి వాడీ చుట్టుపక్కల లేకండా చూస్తా. వాడికి అనుమానం తట్టిందా నీ ప్రాణాలకి నేను జవాబుదారీ కాదు. ఇంక నా ఆదీనం తప్పిపోతాడు.

ఒక్కొక్కరికి యెక్కడో తటస్థిస్తుంది యిట్లాంటి స్థితి. ఎంత కోపం వచ్చినా ఆ స్త్రీ మీద, ఆమె యెన్ని అన్యాయాలు చేసినా, యెంత హింసించినా, యీడ్చి బైట తోసేసినా ఆ స్త్రీని వొదలలేదు. ఆమెలో అందం కాదు. గొప్ప ఆకర్షణ కాదు. చాతుర్యం కాదు. యేమిటి అతన్ని అంత వశ్యుణ్ని చేసేది అతనికే తెలీదు. ఇతరులకీ తెలీదు. అట్లాం టప్పుడే పిచ్చి పుట్టిందనీ, దెయ్యం పట్టిందనీ, ఆ స్త్రీ మందులు పెట్టిందనీ అనుకుంటారు ప్రజలు.

సుబ్రమణ్యానికి అట్లాంటి స్థితి పట్టింది. ఏమాత్రం ఆత్మగౌరవ మున్నా. శక్తి వున్నా మల్లణ్ని, సుగంధినీ యేదో వొకటి చెయ్యడమో తరిమెయ్యడమో చేసి వుండును. కాని సుగంధిని వదలలేదు. మల్లన్నని యెట్లానన్నా తప్పించాలనీ. చంపించాలనీ కూడా ఆలోచించాడు. కాని

అతనికి యే హాని కలిగినా తనమీద సుగంధికి అనుమానం కలుగుతుందనీ, తన నించి వెళ్ళిపోతుందనీ భయపడ్డాడు. చివరికి యెట్లాగైనా సుగంధి తనతో వుంటే చాలు అనిపించింది.

రోజులు జరిగిపోయినాయి. మల్లడు ఆమెని స్వాధీనం చేసుకుంటున్నాడనే మరణవేదనన్నా పడగలడు గానీ, సుగంధిని వొదిలి వుండలేడని అతనికి తెలుసు. మల్లడు సుగంధి దగ్గిర చేరకండా రాత్రిం బవళ్ళు సుబ్రమణ్యం ఆమె దగ్గిరే వుండేవాడు. అతను వున్నంతసేపూ మల్లడు ఆ వేపునన్నా కనపడేవాడు కాడు. వూరుగూరికి ప్రయాణాలసలే మానుకున్నాడు. వర్తకం మూలపడ్డది. మూలుక్కుంటో సణుక్కుంటో అతని అన్నే ప్రయాణాలు వెళ్ళి వొచ్చేవాడు. కొద్దిరోజుల్లో సుబ్రమణ్యం బాగు పడతాడని అతని ఆశ. అన్న లేనప్పుడన్నా సుబ్రమణ్యం ఒకరోజుకూడ కొట్టుకు వెళ్ళడం మానేశాడు. సుగంధిమీది అనురాగం చాత యిట్లా అయినాడని అతని అన్న అనుకుని, తమ్ముణ్ణి కూచోబెట్టి నీతులు బోధించాడు. సుబ్రమణ్యం హృదయంలో మండే దావాగ్ని అతనికేం తెలుసు?

మల్లడి సంగతి తలుచుకుని సుగంధిని యేడిపించాలని సుబ్రమణ్యానికి చాలా బుద్ధి పుట్టేది. రోషం ధగధగ మండేది. కాని యేమన్నా చేస్తే సుగంధి వెళ్ళిపోతుందని భయం.

ఒక రోజు సుగంధి మెళ్ళో సుబ్రమణ్యం బంగారం గొలుసు చూశాడు.

"యెక్కడిది?"

"మల్లన్న యిచ్చాడు."

"వాటి కెక్కడిది?"

"యేమో"

"తెలీకండా అట్లా తీసుకోడమేనా?"

"యేం?"

"నేను ముత్యాలహారం యిస్తే తీసుకోనన్నావే."

"పాపం యెప్పుడూ నువ్వు నా దగ్గిరే వుండడం చాతా కుళ్ళి చస్తు న్నాడు."

"పోని, నన్ను రావొద్దనరాదూ?"

"నీకు ఆడవాళ్ళ సంగతి తెలీదు వూరుకో."

సుబ్రమణ్యం యియ్యకుండానే సుగంధి పట్టుచీరెలు కట్టడం మొదలుపెట్టింది. రూపాయలు వాడుతోంది. సుగంధికి యీ నాగరికత సుబ్రమణ్యానికేం బావుండలేదు. లేడిపిల్లకి బూడ్సులు వేసినట్టుండేది.

పదిహేను రోజులయింతర్వాత ఒకరోజు పోలీసు వాళ్ళు మల్లణ్ణి కన్నం వేసిన నేరంకింద అరెస్టు చేశారు. విచారణ జరిగింది. సుగంధి విచారానికి పరిమితి లేదు. ఆ విచారం చూసి సుబ్రమణ్యానికి ఈర్ష్య, అసహ్యం కలిగాయి. పాయింత్రానికి దొంగ సొత్తు తీసుకుందని సుగంధిని అరెస్టు చేశారు. సుబ్రమణ్యం చాలా అవస్థ పడ్డాడు. అతన్ని కూడా కేసులో సాక్ష్యానికి పిలిచారు. ఆ నగలన్నీ తను చేయించి యిచ్చినవని సుబ్రమణ్యం సాక్ష్యం చెప్పాడు. కాని లాభం లేకపోయింది. ఆ నగల్నీ, చీరెల్నీ వూరి వాళ్ళందరూ గుర్తు పట్టారు. ఆదుర్దాలో సుబ్రమణ్యానికి

వివేకమంతా పోయింది. అతను మల్లన్న చాత దొంగతనం చేయించి సుగంధికి యిచ్చాడనీ, వర్తకంలో నష్టం రావడంవల్ల, యిట్లాంటి వ్యవహారాలు మొదలు పెట్టాడనీ అందరూ నమ్మారు. పెళ్ళాన్ని వొదిలి లంబాడీ ముండని పెట్టుకుని. వర్తకం తగలేసుకున్నాడు. దొంగతనాలు చేయించడం విచిత్రమా? సుబ్రమణ్యం చేయించాడని మల్లన్న చాత పోలీసులు పలికించారు. సుగంధి సాక్ష్యం ఒకసారి మల్లన్న యిచ్చాడనీ, ఒకసారి సుబ్రమణ్యం యిచ్చాడనీ, ఒకసారి తనకి తెలీదనీ నోటికొచ్చినట్లు చెప్పింది. సాక్ష్యం లేకపోవడంవల్ల సుబ్రమణ్యాన్నీ, సుగంధినీ, బెదిరించి వొదిలిపెట్టారు. మల్లడికి ఆరునెల్లు కైదు పడ్డది.

ఇంక సుబ్రమణ్యం అవస్థలు మొదలుపెట్టాయి. వూళ్ళో తలెత్తుకు తిరగడానికి వీలులేదు. అన్నయ్య యింటోంచి వెళ్ళకొట్టాడు. యెన్నాళ్ళని సహిస్తాడు. అతని మొహం చూసేవాడూ, అతనితో మాట్లాడేవాడు లేడు. సుగంధితో పాకలో కాపురమున్నాడు. సుగంధి వంట తిన్నందుకు అతనికి కులంలోంచి వెలివొచ్చింది. పిచ్చి పట్టిన వాడిమల్లే సుగంధి మొహం చూస్తో పడి వుండేవాడు. లోకం, బంధువులు పోతే పోయినారు. యింక ఆర్నెల్ల వరకూ సుగంధి తనదే కదా? యెవరుంటేనేం, లేకపోతేనేం మల్లడు విడుదలై వొచ్చేలోపల. తాము మళ్ళీ వాడికి యెక్కడున్నదీ తెలీకండా. సుగంధిని తీసుకుని వెళ్ళిపోవాలని చూశాడు. సుగంధికి మల్లడిమీద ప్రేమ యెక్కువయింది. తనకోసం కైదులోకి వెళ్ళాడని ఆమె అభిప్రాయం. ఆ వూరినించి సుబ్రమణ్యం, వెళ్ళిపోవాలంటే ఆమె వూరు కదిలి రానంది. చివరికి మోసంచేసి సుగంధిని తీసుకుని చూడ్డానికని

బొంబాయి వెళ్ళి అక్కడతనికి తెలిసిన వర్తకుల సహాయంతో వ్యాపారం మళ్ళీ మొదలుపెట్టాలని నిశ్చయించుకున్నాడు. సుగంధి బొంబాయి చూసి రావడానికి వొప్పుకుంది. సుబ్రమణ్యానికి కొత్త వుత్సాహం కలిగింది. అన్నని తన భాగం పంచి యిమ్మని, దాన్ని అమ్మడానికి ప్రయత్నం చేశాడు. అతని అవసరం తెలిసి యెవరూ కొనలేదు. సగానికి సగం నష్టానికమ్ముకున్నాడు. రిజిష్టరయింది. సగం పైకం యిచ్చారు. తక్కిన సగం పైకం రెండు మూడు రోజుల్లో యిస్తామన్నారు. అది కూడా రాగానే సుగందితో కూడా ప్రయాణం కావడానికి సిద్ధపడుతున్నాడు.

ఒకరోజు రాత్రి సుగంధి, సుబ్రమణ్యం చాలాసేపు పొన్న చెట్టు కింద కూచుని మాట్లాడుకుని యింటికి వెడదామనుకుంటున్నారు రాత్రి పన్నెండు గంటలయింది.

"ఇంకా నాకు నిద్ర రావడం లేదు" అంది సుగంధి.

"నాకూ రావడం లేదు. అయినా పడుకుందాం."

"అబ్బా! పొద్దస్తమానం వ్యవహారంమీద తిరిగాను. ఇప్పుడు కూడా కొంచెం పడుకోనియ్యవు?"

"ఇప్పుడు పడుకుంటే మాత్రం నువ్వు నిద్రపోతావా?"

"నిజం చెప్పు. నన్ను చూస్తే నీకు యిష్టముందా మునపటి మల్లే?"

"నిజంగా వుంది. లేకపోతే నా కొండల్నీ, అడవుల్నీ, వాదుల కాని నీ దగ్గర వుంటానా?"

కొంచెంగా వొచ్చిన వెన్నెలలో యెవరో తోటలో వాడిగా పరి గెత్తుతున్నట్లు కనపడ్డది. సుబ్రమణ్యం యెవరని కేకేశాడు. ఆ కేక విని వాడు వీళ్ళవేపు పరిగెత్తుకొచ్చి సుగంధిని "యిట్లారా పూట" అని చెయ్యి పట్టుకు లాక్కెళ్ళాడు. వాడు మల్లన్న. సుబ్రమణ్యం ఆశ్చర్యపడి చూస్తో నుంచున్నాడు. వీడెట్లా వొచ్చాడు? యేం చెయ్యబోతున్నాడు? భయమేసి తనూ వాళ్ళ దగ్గరికి వెళ్ళాడు. ఇద్దరు మాటాడడం మానేసి నుంచున్నారు.

"చెప్పు" అన్నాడు మల్లన్న.

"నేను మల్లన్నతో వెడుతున్నాను. ఇతను జైలులోంచి తప్పించు కొచ్చాడు. పోలీసులు వెనక వొస్తున్నారు. నేను వెళ్ళిపోతున్నాను."

"వాడితో వెళ్ళిపోతావా? జైల్లోంచి తప్పించుకున్న దొంగతో? యెక్కడున్నా పట్టిస్తారు వాణ్ణి. నిన్ను పట్టుకుంటారు."

"నువ్వు మాత్రం వెళ్ళడానికి వీల్లేదు" అన్నాడు సుగంధితో మళ్ళీ.

"ఇప్పుడు నీతో మాట్లాడ్డానికి కూడా వ్యవధిలేదు. నేను వెడుతు న్నాను. నువ్వు కూడా రా" అంది సుగంధి వెడుతో.

"నేనా? నేను రావడ మేమిటి? యెక్కడికి?"

సుగంధి ఆగి అతని దగ్గిరికి వొచ్చి గట్టిగా కావిలించుకుని కళ్ళ ల్లోకి చూసి "రావూ?" అంది.

అంతే తరవాత అతనేం చేశాడో. యేమనుకున్నాడో? వాళ్ళవెంట పరిగెత్తుతున్నాడు తను కూడా.

తోట దాటి వూరి మధ్యనించి పరిగెత్తుతున్నాడు చప్పుడు కాకండా.

నిశ్శబ్దం. అక్కడక్కడ ఒక కుక్క మొరుగుతోంది. వీళ్ళని చూసి సుబ్రమణ్యానికి ఆలోచన తోచింది. ఈదొంగని మళ్ళీ పట్టిస్తే? అని. అంతకంటే యోచించకండానే మల్లణ్ణి నడుం వెంటనే కావిలించుకుని "దొంగ దొంగ" అని అరిచాడు. మల్లడు పెనుగులాడాడు. సుగంధి "వొదులు వొదులు" అంది. సుబ్రమణ్యం అరుస్తున్నాడు. తలుపులు తెరుచుకుని మనుషులు వొస్తున్నారు. సుబ్రమణ్యాన్ని తోసేసి మల్లడు తప్పించుకుని వెనక సుగంధి తగిలి కింద పడ్డాడు. సుబ్రమణ్యం మళ్ళీ పట్టుకోబోయినాడు. "చచ్చావు యివాళ" అని కత్తి తీశాడు మల్లన్న. సుబ్రమణ్యం అది చూసే స్థితిలో లేడు. వాడు యీ పని యెప్పుడు చేస్తాడా అని సుగంధి చూస్తో వుంది. ఇద్దరికీ అడ్డంగా వొచ్చింది. వాడి కత్తి ఆమె భుజంలో గుచ్చుకుంది. అరిచి కూలబడ్డది. మనుషులు వొచ్చేశారు. సుబ్రమణ్యం మల్లణ్ణి చూపించి "వాడే దొంగ పట్టుకోండి" అన్నాడు. వాడి కత్తిచూసి ఒకరూ దగ్గిరికి రాలేదు. మల్లన్న పారిపోవాలని చూశాడు. కాని కింద పడివున్న సుగంధిని చూసి ఆగాడు.

"నీకు దీన్ని దక్కనిస్తానా" అని సుబ్రమణ్యం మీద దూకాడు. అతను గుంపులోకి పరిగెత్తాడు.

మల్లడు "సుగంధి" అని ఆమెకేసి వొంగి గుండెల్లో కత్తి పెట్టి పొడిచేశాడు. పోలీసులు వొచ్చారు.

*